క్లుప్తంగా

పార్టీ కోసం కష్టపడిన వారికి సముచితస్థానం



భవానీపురం(విజయవాడపశ్చిమ): పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి సముచిత స్థానం లభిస్తుందని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యుడిగా ఎన్టీఆర్ జిల్లాకు చెందిన తోకల శ్యామ్ కుమార్ నియమితులైన క్రమంలో ఆయన లేళ్ల అప్పిరెడ్డిని కృతజ్ఞతాపూర్వకంగా కలిశారు. గురువారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆయన కార్యాలయానికి వెళ్లిన తోకల శ్యామ్‌కుమార్ పుష్పగుచ్ఛమిచ్చి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ నాయకులు తులిమెల్లి సుందర్ ప్రసాద్, కామళ్ల జోజి, పిల్లి విజయ్ కుమార్, కొప్పుల సురేష్, సాయి పాల్గొన్నారు.

షర్మిల తీరుతో కాంగ్రెస్‌కు రాజీనామా..!

ఖాజా మొయిద్దీన్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పీసీసీ అధ్యక్షురాలు షర్మిల తీరుతో కాంగ్రెస్‌కు రాజీనామాకు చేస్తున్నానని, పరిపాలనా దక్షత, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పని చేయాలని నిర్ణయించుకున్నట్లు ఖాజా మొయిద్దీన్ పేర్కొన్నారు. సిటీ కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్, ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సభ్యత్వానికి షేక్ ఖాజామొయిద్దీన్ గురువారం రాజీనామా చేశారు. 46వ డివిజన్‌లోని మొయిద్దీన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజీనామా లేఖను మీడియాకు చూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లు కాంగ్రెస్ కోసం ఎంతో కష్టపడి పని చేసినా గుర్తింపు ఇవ్వలేదన్నారు. షర్మిల తీరుతో కాంగ్రెస్ పార్టీ, సీనియర్ల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు.

మర్యాదపూర్వక కలయిక



భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఎలక్షన్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గేరా హనోక్ వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎన్నికల ప్రధాన కార్యాలయానికి వచ్చిన ఆయన్ని ఆసిఫ్ సాదరంగా ఆహ్వానించారు. డాక్టర్ గేరా హనోక్‌కు పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఏఐసీసీ రాష్ట్ర పొలిటికల్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిరాల కమలాకరరావు, రాష్ట్ర కార్యదర్శి జొన్నకూటి రాబిన్, సిటీ కార్యదర్శి సతీష్, ఉపాధ్యక్షులు నెహెమ్యా, 55వ డివిజన్ కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కల్యాణ మహోత్సవాలు



తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు, పర్యవేక్షణలో సప్తకలశ స్నాపనం, హోమం, బలిహరణ, వసంతోత్సవం, చక్రతీర్థం, మహానివేదన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈవో నూతక్కి సాంబశివరావు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ అమ్మవారి తిరునాళ్ల



విస్సన్నపేట: పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో వార్షిక తిరునాళ్ల మహోత్సవం మూడో రోజు గురువారం కొనసాగింది. గురువారం జలబిందెలు, పూలకప్పెర, ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి. బుధవారం రాత్రి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. జానపద డప్పులు, కనకతప్పెట్లు, శక్తివేషాలు, విద్యుత్ కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన ప్రభలతో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

కొండలపై పేదలను ఖాళీ చేయించడానికి కుట్రలు

- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని
- సింగపూర్ పేరుతో మభ్యపెడుతున్న సుజనా
- గతంలో చంద్రబాబు, ఇప్పుడు సుజనా మోసాలు



కొండ పైభాగాన ఎన్నికల ప్రచారంలో కేశినేని నాని, షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గాన్ని సింగపూర్ పేరుతో కొండలపై పేద ప్రజలను ఖాళీ చేయించే కుట్రలకు సుజనాచౌదరి పన్నాగం పన్నుతున్నారని విజయవాడ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ ఆధ్వర్యంలో కేశినేని నాని, పార్టీ పశ్చిమ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి కొత్తపేట కొండ ప్రాంతంలో గురువారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి తమకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించడంతో రానున్న కాలంలో మరింత అభివృద్ధి చేస్తామని వివరించారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ సింగపూర్ పేరుతో భారీ భవనాలను నిర్మిస్తామంటూ సుజనాచౌదరి చెబుతున్నారన్నారు. ఆ పేరుతో కొండలపై పేదలను ఇక్కడి నుంచి పంపించేందుకు కుట్రలు చేస్తున్నారని వివరించారు. 2014లో చంద్రబాబు సింగపూర్ పేరుతో అమరావతి కడతానని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారన్నారు. సుజనా చౌదరికి రాజకీయ గురువు చంద్రబాబునాయుడు అన్నారు. వెస్ట్‌ని బెస్ట్ చేస్తామని మాయ మాటలు మాట్లాడుతున్నారని చెప్పారు.

సింగపూర్‌లో అందరూ ధనవంతులు ఉంటారని, ఇక్కడ పేదల్ని తరిమేసి సుజనా చౌదరి అండ్ కో ఈ ప్రాంతాన్ని దోచుకుంటారని ఆరోపించారు. 2014లో ఇదే కూటమి చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ 650 హామీలు ఇచ్చారన్నారు. వాటిలో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన పథకాలు అన్నీ పేద ప్రజలకు అందించారన్నారు. చంద్రబాబు మాయ మాటలు నమ్మే పరిస్థితిలో జనాలు లేరని చెప్పారు. పశ్చిమ అభ్యర్థి ఆసిఫ్ స్థానికుడన్నారు. అనేక అభివృద్ధి పనులు చేసిన వ్యక్తి, నియోజవర్గం గురించి ఇక్కడ పేదల సమస్యల గురించి పూర్తిగా తెలిసిన వ్యక్తి ఆసిఫ్ అని కొనియాడారు.

ఏమి చేశారని టీడీపీ కూటమికి ఓటెయ్యాలి

2014లో పోటీ చేసి గెలిచిన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రజలకు ఏమి మేలు చేశారని ఇప్పుడు వచ్చి ఓటు అడుగుతున్నారని 'పశ్చిమ' అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారాన్ని చేపట్టిన తర్వాత నియోజకవర్గంలో అద్భుతమైన అభివృద్ధి జరిగిందన్నారు.

సుమారు 460 కోట్ల మేర నిధులు అభివృద్ధికి ఖర్చు చేశామని తెలిపారు. సుమారు రూ.850 కోట్ల మేర సంక్షేమ కార్యక్రమాల ద్వారా నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో వేశారన్నారు. ఇంత అపూర్వమైన సంక్షేమం, అభివృద్ధి చేసిన ప్రభుత్వం గతంలో లేదని చెప్పారు. దీనిపై దమ్ముంటే ప్రతిపక్షాలు చర్చకు రావాలని సవాల్ చేశారు. అభివృద్ధి, సంక్షేమం కేవలం జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని వివరించారు.

జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

కేశినేని శ్వేత



పశ్చిమ నియోజకవర్గంలోఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కేశినేని శ్వేత



వ్యాపార వర్గాల్లో ప్రచారం చేస్తున్న శ్వేత, ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే పార్టీ గెలుపునకు బాటలు వేస్తాయని విజయవాడ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ కుమార్తె కేశినేని శ్వేత అన్నారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 39వ డివిజన్‌లో గురువారం స్థానిక కార్పొరేటర్ గుడివాడ రాఘవ నరేంద్రతో కలిసి కేశినేని శ్వేత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లోని గుప్తా సెంటర్ డౌన్, షాదీఖానా పరిసర ప్రాంతాల్లో ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా కేశినేని శ్వేత మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసిందన్నారు. నాడు -నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనందిస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం వైఎస్సార్ సీపీ పాలనలోనే సాధ్యమైందన్నారు. ఎంపీ కేశినేని నాని రెండు పర్యాయాలు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించి నియోజకవర్గంలో అనేక సమస్యలు పరిష్కరించారన్నారు. దీర్ఘకాలిక సమస్యలు తీర్చారని తెలిపారు. దుర్గగుడి ఫ్లైఓవర్, నందిగామ బైపాస్ నిర్మాణానికి కృషి చేశారన్నారు. ఎంపీగా కేశినేని నాని చేసిన అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోందన్నారు. స్థానికంగా ఓటు లేని వ్యక్తులు ప్రజల ముందుకు వచ్చి ఓట్లు అభ్యర్థిస్తున్నారని చెప్పారు. చైతన్యవంతులైన పశ్చిమ నియోజకవర్గం ప్రజలు స్థానికేతరులను నమ్మబోరన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండే ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్‌కు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పడిగిపాటి చైతన్యరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ దాసి జయప్రకాశ్ కెనడి, ఏలూరు వెంకన్న, డీవీ రెడ్డి, బొండా సాంబశివరావు, బుర్రా నరసింహం, జంగం సాయిబాబు, రాజవరపు వెంకటచ పాబోలు శ్రీనివాసరావు, అంబడపూడి శ్రీకాంత్, తలారి హరీష్, పాశం శ్రీనివాసరావు, వడకాపురపు శ్రీనివాస్, పట్నాల రవి, స్రవంత్, భరత్, ఆకుల రూపారాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార వర్గాలకు అండగా..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వ్యాపార వర్గాలకు అండగా జగన్ ప్రభుత్వం కొనసాగుతుందని వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని కుమార్తె కేశినేని శ్వేత అన్నారు. 37వ డివిజన్ కార్పొరేటర్ మండేపూడి చటర్జీ ఆధ్వర్యంలో కేశినేని నాని, పశ్చిమ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ విజయాన్ని కాంక్షిస్తూ కేశినేని శ్వేత విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పాతబస్తీలోని పులిపాటి వారి వీధి, భావనారాయణ వీధి తదితర ప్రాంతాల్లో శ్వేత వ్యాపార వర్గాలను కలిసి వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వ్యాపార వర్గాల అభ్యున్నతికి తన తండ్రి కేశినేని నాని, స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌లు అండగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

44వ డివిజన్‌లో జోరుగా ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో ఆసిఫ్, రత్నకుమారి

భవానీపురం(విజయవాడపశ్చిమ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గడిచిన 58 నెలల్లో కులమతాలు, పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా మేలు చేశామని, అది కొనసాగాలంటే జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించి గెలిపించాలని వైఎస్సార్ సీపీ 'పశ్చిమ' ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సాయంత్రం 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, వైఎస్సార్ సీపీ సంయుక్త రాష్ట్ర కార్యదర్శి మైలవరపు దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. ఈ డివిజన్‌లో చంద్రబాబు ప్రభుత్వం విస్మరించిన అభివృద్ధిని జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మీ కళ్ల ముందే కోట్లాది రూపాయలతో చేశామని తెలిపారు. ముఖ్యంగా కొండ ప్రాంతంలో శిథిలమైన మెట్లు, డ్రెయిన్లు, రిటైనింగ్ వాల్స్ నిర్మాణాలను చేపట్టి గిరివాసుల కష్టాలను తొలగించామని పేర్కొన్నారు. డివిజన్‌లో తాగునీటి బూస్టర్, కొత్త వాటర్ పైప్ లైన్లు ఏర్పాటు చేసి మంచినీటి సమస్యను పరిష్కరించామని చెప్పారు.

జగన్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రానికి మేలు

పేదల జీవితాల్లో వెలుగులు నిండాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్టానికి మరింత మేలు జరుగుతుందని ఆసిఫ్ పేర్కొన్నారు. మేలు జరిగితేనే ఓటేయండని చెప్పే దమ్మున్న నాయకుడు జగన్ అన్నారు. పద్నాలుగేళ్ల చంద్రబాబు పాలనలో ప్రజలకు చెప్పుకునేందుకు ఒక్క సంక్షేమ పథకమైనా ఉందా, పోనీ తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తారో అయినా చెప్పగలరా అని ప్రశ్నించారు. చంద్రబాబు పాలనంతా అవినీతి, ఆశ్రిత పక్షపాతం, రాష్ట్ర సంపదను కొల్లగొట్టడం తప్ప ఏముందని ఎండగట్టారు. పండుగల సందర్భంగా ఇంటింటికీ వచ్చి బూటకపు మాటలు చెప్పే పగటి వేషగాళ్లు ఇప్పుడు ఎన్నికల ముందు సుజనా చౌదరి పేరుతో వచ్చాడని ఎద్దేవా చేశారు. ప్రజా సేవ ముసుగులో వచ్చిన బ్యాంకుల దొంగ సుజనా చౌదరి రేపు ఎక్కడ ఉంటారో చెప్పగలడా అని సవాల్ విసిరారు. స్థానికుడిని, మీలో ఒకడినని తనతోపాటు విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో అందరికీ చిరపరిచితుడు కేశినేని శ్రీనివాస్(నాని)ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తొలుత విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆసిఫ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యలకల చలపతిరావు, 52వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి తంగెళ్ల రామచంద్రరావు, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, దాసి జయప్రకాష్ కెనడి, ఎద్దు సురేష్, కటస్ కరిముల్లా, లేళ్లపూడి లాజర్, కుంభా జోజి, లోలుగు శేఖర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిపై నేడు నూతన యాగశాలలో పూజలు



అమ్మవారి సన్నిధిలో అందుబాటులోకి వచ్చిన యాగశాల

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై నూతనంగా నిర్మించిన యాగశాలలో శుక్రవారం పూజలు నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయం నుంచి మల్లేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకునే దారిలో రాధాకృష్ణుల విగ్రహం వద్ద సుమారు 250 గజాల్లో యాగశాల నిర్మించారు. రెండు నెలల్లో పూర్తైన యాగశాలను దాత సంగా నరసింహారావు రూ. 5 కోట్లతో నిర్మించారు. దీనికి అవసరమైన రాతి స్తంభాలు, చప్పురాయి, రాతి భీములు, పాదికలను క్వారీ వద్దే తయారు చేసి క్రేన్ సాయంతో కొండపైకి చేర్చారు. గురువారం యాగశాలను దుర్గగుడి ఈవో కె.ఎస్.రామరావు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. శుక్రవారం ఉదయం 10.45 గంటల సమయంలో యాగశాల ప్రారంభోత్సవం జరుగుతుందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. తొలుత పుణ్యాహవచనం, గణపతి పూజ, మండపారాధన, చండీ మూలమంత్ర హోమం నిర్వహిస్తారు. యాగశాల తుది మెరుగులు దిద్దేందుకు చిన్న పాటి పనులు మిగిలి ఉండగా, మరో నాలుగు నెలల పాటు మంచి ముహూర్తాలు లేకపోవడంతో శుక్రవారం ముహూర్తాన్ని ఆలయ స్థానాచార్య, వైదిక కమిటీ ఖరారు చేసింది. దీంతో యాగశాల వద్ద పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపున ఘాట్ రోడ్డులోని సమాచార కేంద్రం వద్ద డోనర్ సెల్ భక్తులకు శుక్రవారం నుంచే అందుబాటులోకి రానుంది. అమ్మవారికి విరాళాలు ఇచ్చే భక్తులు, దాతలు సౌకర్యార్థం సెల్‌ను ఏర్పాటు చేశారు.

మలేరియా జ్వరాలపై అవగాహన పెంచుకోవాలి



రైల్వే ఆస్పత్రిలో మలేరియాపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): మలేరియా జ్వరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రైల్వే ఆస్పత్రి అదనపు చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.జయదీప్ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం రైల్వే హాస్పటల్ కొత్త ఓపీలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే కాలనీల్లో, చుట్టు పక్కల నీరు నిలవకుండా చూసుకోవాలని దీంతో దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయన్నారు. డాక్టర్ పూర్ణచంద్రరావు ప్రజలకు మలేరియా జ్వరం వచ్చినప్పుడు లక్షణాలు ఎలా ఉంటాయి, తీసుకోవల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ వి.వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): మలేరియా వ్యాధి వచ్చిన తర్వాత కంటే ముందుగా నివారించడం మనందరి ప్రధాన లక్ష్యమని యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జమీల్ అన్నారు. ప్రపంచ మలేరియా డేను పురస్కరించుకుని యూపీహెచ్‌సీ గులాం మొహిద్దీన్‌నగర్‌లోని మలేరియా సబ్ యూనిట్-1 ఆఫీసర్ నగేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జమీల్ మాట్లాడుతూ 2027 నాటికి మలేరియా కేసులు లేకుండా చేయడంతోపాటు 2030కి మన దేశంలో మలేరియాను నిర్మూలించడమే లక్ష్యమన్నారు. మలేరియా నివారణ కోసం పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడటంతో పాటు దోమల లార్వా వృద్ధి చెందకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దోమల లార్వా నిర్మూలన కోసం సిబ్బంది క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే శివారు ప్రాంతాల్లో నివసించే వారు దోమ తెరలు వినియోగించేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో మలేరియా సూపర్‌వైజర్లు నిరీక్షణరావు, గజేంద్ర, హెచ్‌వీ జయలక్ష్మి, మలేరియా సిబ్బంది, యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి బీజేపీ నాయకులు



భవానీపురం(విజయవాడపశ్చిమ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులైన పలువురు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. గురువారం విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎన్నికల ప్రధాన కార్యాలయానికి వచ్చిన బీజేపీ నగర ఉపాధ్యక్షురాలు ముద్దాని రమణమ్మ(రమణ), 38వ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు దావాలి బుజ్జి, లక్ష్మణ్, బాషా, బి రామకృష్ణ, లింగయ్య, రాములను పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ సాదరంగా ఆహ్వానించారు. పశ్చిమ నియోజకవర్గం మరింత అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని పేర్కొన్నారు. బీజేపీ పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి వంటి మతతత్వ పార్టీల వ్యక్తులకు నియోజకవర్గంలో చోటు లేదన్నారు.

మే 1న జయహో జానపదం

విజయవాడకల్చరల్: దామోదర జానపదం, మామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మే ఒకటో తేదీ ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో జయహో జానపదం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ గాయకుడు దామోదర గణపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు జానపద గీతాలను ఆలపిస్తారని పేర్కొన్నారు.

హోమియో మందుల పంపిణీ

నందిగామ: పట్టణానికి చెందిన సత్య దివ్యాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం వడదెబ్బ నివారణకు హోమియో మందులు పంపిణీ చేశారు. మండలంలోని మునగచర్ల పరిసర ప్రాంతాలలో పనిచేస్తున్న 500 మంది వ్యవసాయ కూలీలకు ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేశారు.

స్వరఝరి సంగీత కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకోవాలి



సంగీత కచేరీ నిర్వహిస్తున్న సంగీత విద్వాంసులు

విజయవాడకల్చరల్: స్వరఝరి సంస్థ నిర్వహించే సంగీత కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకోవాలని సంగీత విద్వాంసుడు కొంమాండూరి శేషాద్రి అన్నారు. స్వరఝరి సంగీత సంస్థ 36వ వార్షిక వేడుకలు, సంగీత విద్వాంసులకు వార్షిక పురస్కారాలు, వాయిలీన త్రయం సంగీత కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. శేషాద్రి మాట్లాడుతూ స్వరఝరి సంగీత సేవలను కొనియాడారు. సంస్థ ప్రధాన కార్యదర్శి మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కొంమాండూరి శేషాద్రికి స్వరఝరి, చింతలపాటి రాజ్యలక్ష్మి స్మారక పురస్కారం, మృదంగ విద్వాంసురాలు దండమూడి సుమతీ రామ్మోనరావుకు లయ ప్రవీణ బిరుదును ప్రదానం చేశారు. సంగీత కార్యక్రమంలో భాగంగా కొంమాండూరి శేషాద్రి, కొంమాండూరి అనంత శౌరిరాజన్, డాక్టర్ కొంమాండూరి వెంకటకృష్ణ వయోలిన్‌పై శ్రీ రాఘవంతో ప్రారంభించి మహాగణపతిం, గాన మూర్తి, జ్ఞాన మొసగరాదా, దొరుకునా ఇటువంటి సేవ కీర్తనలను పలికించారు. బీవీఎస్ ప్రసాద్, ఎమ్ హరిబాబు వాద్య సహకారం అందించారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసులు అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'శారద' విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు



బి.తన్విక
1140వ ర్యాంకు



ఎ.సంపత్
1441 ర్యాంకు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జేఈఈ మెయిన్స్-2024 ఫలితాల్లో తమ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని శారద విద్యాసంస్థల చైర్మన్ వై.రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరిలో బి.తన్విక-1140వ ర్యాంకు, ఎ.సంపత్-1441 ర్యాంకు, పి.అస్మిత-3690వ ర్యాంకు, బి.నిత్యశ్రీ-4630వ ర్యాంకు, కె.నాగరాహుల్ ధృవ-5150వ ర్యాంకు, కె.ఉదయ బాలకుమార్-6598వ ర్యాంకులను పొందారని తెలియజేశారు. కేవలం డే స్కాలర్స్ విద్యార్థులతోనే ఇలాంటి ఉత్తమ ఫలితాలను సాధించగలుగుతున్నామని తెలిపారు. తమ విద్యాసంస్థ నుంచి మొత్తం 650 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా వారిలో 350 మంది ఉత్తమ ర్యాంకులు పొందారని వివరించారు. ఒత్తిడి లేని విలువలతో కూడిన విద్య, విద్యార్థుల క్రమశిక్షణ, అధ్యాపకులు సలహాలు, సూచనలతో పాటుగా ప్రశాంత వాతావరణం, ఆన్‌లైన్ పరీక్ష ప్రణాళిక విద్యార్థులకు ఇలాంటి ర్యాంకులు పొందడానికి అనుకూలించిన అంశాలని కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి పేర్కొన్నారు. ఈ ర్యాంకులు సాధించడానికి కళాశాల మేనేజ్‌మెంట్ విద్యార్థులపై చూపిన వ్యక్తిగత శ్రద్ధ, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం ఎంతో ఉందని కళాశాల సలహాదారుడు ఈఎస్ఆర్‌కే ప్రసాద్, కళాశాల జనరల్ మేనేజర్ జీవీ రావు పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులు పొందిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యంతో పాటుగా అధ్యాపకులు అభినందించారు.

కనులపండువగా శివకల్యాణం



శివలింగానికి అభిషేకం చేస్తున్న గజల్ శ్రీనివాస్, డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మరకత శివలింగ వాయు ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా గురువారం శివకల్యాణం కనులపండువగా జరిగింది. మందిర గౌరవాధ్యక్షులు పూనూరు గౌతంరెడ్డి, దొంతిరెడ్డి లక్ష్మణరెడ్డి దంపతులు కల్యాణం జరిపించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు శివకల్యాణంలో పాల్గొన్నారు. ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ మరకత శివలింగానికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరకత శివలింగం ప్రతిష్ఠతో బుధుడి ఆశీస్సులు లభిస్తాయని ధనయోగం కలుగుతుందన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో మందిర కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

పెనమలూరు: కొద్ది రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైన వ్యక్తి గురువారం కృష్ణానదిలో శవమై తేలాడు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికగర్‌కు చెందిన జక్కంపూడి నాగరాజు(29) అవివాహితుడు. హౌస్‌కీపింగ్ పని చేస్తాడు. అతని ఇంటి ఎదురుగా ఉండే లాల్‌బీ కోరిక మేరకు బంగారు చెవి బుట్టలు తాకట్టు పెట్టి డబ్బు తీసుకువచ్చి ఆమెకు ఇచ్చాడు. తాకట్టు పెట్టిన బంగారు చెవి బుట్టల విషయంలో ఆమెకు నాగరాజుకు మధ్య వివాదం తలెత్తడటంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు నాగరాజుపై కేసు నమోదు చేశారు. గత నెల 15 నుంచి నాగరాజు కనిపించలేదు. కాగా ఈ నెల 22న నాగరాజు సోదరికి వాట్సాప్ మెసేజ్ చేశాడు. బైక్, ఫోన్, లెటర్ ప్రకాశం బ్యారేజ్ వద్ద ఉంచానని మెసేజ్‌లో పేర్కొన్నాడు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రకాశం బ్యారేజీ వద్దకు వెళ్లి చూడగా బైక్, వస్తువులు ఉన్నాయి. అయితే నాగరాజు కనబడలేదు. దీంతో నాగరాజు తల్లి వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు. అతని కోసం గాలించగా గురువారం కృష్ణనదిలో శవమై కనిపించాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): పదోతరగతి పరీక్ష ఫలితాల్లో 500పైగా మార్కులు సాధించిన ముండ్లపాడు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను గ్రామసర్పంచి గూడపాటి లావణ్య ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించి నగదు బహుమతులను అందజేశారు. కోలా మహేష్(553), గొర్రెపాటి సృజల(549), దమ్ముల బేబి(505), మందా స్వరూపారాణి(503), కనపర్తి పూజిత(502)లకు పగడాల రామారావు ఒకొక్కరికి రూ.5 వేలు, పగడాల రవికుమార్ మొదటి ముగ్గురు విద్యార్థులకు వరుసగా రూ.10వేలు, రూ.6వేలు, రూ.4వేలు అందించారు. మందా స్వరూపారాణికి వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు రూ.3వేలు, పూజితకు పేరెంట్స్ కమిటీ చైర్మన్ సరాల మధుసూధనరెడ్డి రూ.2వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి అభినందించారు. ఈసందర్భంగా సర్పంచి లావణ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఏరాష్ట్రంలో లేనివిధంగా ప్రాముఖ్యత ఇస్తున్నారన్నారు. పిల్లలకు మనమిచ్చే ఆస్తి విద్య మాత్రమేనని నమ్మి విద్యారంగ అభివృద్ధికి విశేషంగా కృషిచేయడంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించగలిగారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గూడపాటి రవికుమార్, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, ఉపసర్పంచి గుత్తా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కూచి విష్ణు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.